# పోలీసులపై సెటిల్‌మెంట్ ఆరోపణ ఆందోళనకరం

**- పటమట ఠాణా, ప్రైవేటు హోటల్ సీసీటీవీ ఫుటేజ్‌లను భద్రపరచండి - పోలీసు ఉన్నతాధికారులకు హైకోర్టు ఆదేశం - పటమట పోలీసులు హోటల్‌లో సెటిల్‌మెంట్లు చేస్తున్నారంటూ పిల్**





అమరావతి: విజయవాడలోని పటమట పోలీసులు 'కార్తికేయ ఫ్రైడ్' అనే ప్రైవేట్ హోటల్ కేంద్రంగా వివాదాలను సెటిల్‌మెంట్ చేస్తున్నారని పిటిషనర్ చేస్తున్న ఆరోపణ ఆందోళన కలిగిస్తోందని హైకోర్టు ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఆ హోటల్‌తో పాటు పటమట పోలీసుస్టేషన్లో సీసీటీవీ ఫుటేజ్‌లను భద్రపరచాలని పోలీసు ఉన్నతాధికారులను ఆదేశించింది. తదుపరి విచారణను జూన్‌కు వాయిదా వేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసా గిల్, జస్టిస్ ఎన్ జయసూర్యతో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది. వ్యక్తులను అక్రమంగా నిర్బంధించి, బెదిరించి.. కార్తికేయ ఫ్రైడ్ హోటల్‌లో విజయవాడ అదనపు డిప్యూటీ పోలీసు కమిషనర్ ఎన్‌బీఎం మురళీకృష్ణ, పటమట ఠాణా ఎస్‌హెచ్‌వో పవన్ కిశోర్ విచారణలు, సెటిల్‌మెంట్లు చేస్తున్నారని, ఈ వ్యవహారంపై సీబీఐతో దర్యాప్తు జరిపించాలంటూ పల్నాడు జిల్లాకు చెందిన కర్నాటి వీరభద్రరావు హైకోర్టులో పిల్ వేశారు. శుక్రవారం జరిగిన విచారణలో పిటిషనర్ తరఫున న్యాయవాది పొన్నేకంటి మల్లికార్జునరావు వాదనలు వినిపించారు. పిటిషనర్ 70 ఏళ్ల వయసులో న్యాయం కోసం పోరాటం చేస్తున్నారన్నారు. ఈ ఏడాది మార్చి 1 నుంచి మే 1 వరకు సీసీటీవీ ఫుటేజ్‌ను భద్రపరిచేలా ఆదేశించాలని కోరారు.

నిరాధార ఆరోపణలు: ఎస్‌జీపీ

పోలీసుల తరఫున ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్‌జీపీ) విష్ణుతేజ వాదనలు వినిపించారు. 'పోలీసులపై పిటిషనర్ చేస్తున్న ఆరోపణలు నిరాధారమైనవి. పిటిషనర్‌ను ఓ కేసులో పోలీసులు అరెస్ట్ చేసి మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు. పిటిషనర్ ఏకకాలంలో సింగిల్ జడ్జి దగ్గర రిట్ పిటిషన్, ధర్మాసనం ముందు పిల్ దాఖలు చేశారు. పిల్ వేయడానికి పిటిషనర్ అర్హుడు కాదు. ప్రైవేట్ హోటల్‌లో సీసీటీవీ ఫుటేజ్‌ను స్వాధీనం చేసుకోలేము' అని అన్నారు. ధర్మాసనం స్పందిస్తూ.. 'మీరేం అధికారం లేనివారు కాదు' అని వ్యాఖ్యానించింది.

# పారదర్శకత లక్ష్యంగా నూతన చట్టం

**- పన్నుల విధానంలో ఇదో సరికొత్త అధ్యాయం**
**- సీబీడీటీ సభ్యుడు సంజయ్ బహదూర్**



హైదరాబాద్: ఆదాయపు పన్ను చట్టం కేవలం ఒక ఆర్థిక నిబంధన మాత్రమే కాదని... అది ప్రభుత్వానికి, పౌరులకు మధ్య ఉండే సుహృద్భావ అనుబంధమని కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు(సీబీడీటీ) సభ్యుడు సంజయ్ బహదూర్ తెలిపారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని మెహదీమంజిల్‌లో ఆదాయపు పన్ను కొత్త చట్టంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమం 'ప్రారంభ్-2026'కి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా సంజయ్ బహదూర్ మాట్లాడుతూ... "బ్రిటిష్ కాలం నాటి మూలాలున్న ఆదాయపు పన్ను చట్టం కాలక్రమేణా అనేక మార్పులు చేర్పులతో ఒక గందరగోళ పాత భవనంలా మారింది. అధికారులకు సైతం సరిగ్గా అర్థం కాకుండా సంక్లిష్టంగా తయారైంది. ఆ క్లిష్టతను తొలగించి, పన్ను చెల్లింపుదారులకు అత్యంత సులభతర, పారదర్శక వ్యవస్థను కేంద్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రధానంగా ఐదు లక్షలకుపైగా ఉన్న పాతచట్టంలోని పదజాలాన్ని కొత్త చట్టంలో సగానికి కుదించింది. దాంతో పన్ను నిబంధనల అమలు సులభతరం అవుతుంది. కోర్టు వివాదాలు సైతం గణనీయంగా తగ్గుతాయి" అని వివరించారు.

# ధర్మవరంలో పట్టపగలే వ్యక్తి అపహరణ

**- భూ వివాదంలో ఆర్డీఓ కోర్టుకు రాగా కారులో ఎత్తుకెళ్లిన ప్రత్యర్థులు**





ధర్మవరం: ధర్మవరం పట్టణంలో పట్టపగలు ఓ వ్యక్తిని కొందరు కారులో అపహరించడం కలకలం రేపింది. పోలీసులు అప్రమత్తమై నిందితులను అదుపులోకి తీసుకుని, సదరు వ్యక్తిని కుటుంబసభ్యులకు అప్పగించారు. ముదిగుబ్బ మండలం కమ్మవారిపల్లికి చెందిన ముసుగు నారాయణస్వామికి అదే గ్రామానికి చెందిన కంద్యాల రవీంద్రకు భూ తగాదా ఉంది. ఇరువర్గాలు ధర్మవరంలోని ఆర్డీవో కోర్టు వాయిదాకు వచ్చారు. అనంతరం కార్యాలయం నుంచి బయటకు వచ్చిన ముసుగు నారాయణస్వామిని రవీంద్ర, అతడి కుమారుడు అరుణ్, మరో నలుగురు కలిసి కారులో బలవంతంగా ఎత్తుకెళ్లారు. అతడిపై దాడి చేసి అయిదు ఖాళీ ప్రాంసరీ నోట్లపై సంతకాలు చేయించుకున్నారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వెంటనే ధర్మవరం వన్‌టౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ నాగేంద్రప్రసాద్, ఎస్ఐ ఉమాదేవి, పోలీసులు బృందాలుగా ఏర్పడి గాలింపు చేపట్టారు. రామగిరి మండలంలో అదుపులోకి.. రామగిరి మండలం శ్రీహరిపురం వద్ద కారును పోలీసులు పట్టుకొని ధర్మవరం వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌కు తరలించారు. అపహరణకు గురైన నారాయణస్వామిని కుటుంబసభ్యులకు అప్పగించారు. రవీంద్ర, అతడి కుమారుడు అరుణ్‌కుమార్, హరి, మధుసూదన్‌నాయుడు, ప్రదీప్, ఉదయ్‌లను అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. కమ్మవారిపల్లికి చెందిన కంద్యాల నారాయణ నుంచి రెండున్నర ఎకరాల భూమిని 29 ఏళ్ల క్రితం కొనుగోలు చేశానని, ఆ భూమి తనదంటూ అతడి కుమారుడు రవీంద్ర ధర్మవరం ఆర్డీవో కోర్టులో కేసు వేశాడని ముసుగు నారాయణస్వామి తెలిపారు. వాయిదాకు వచ్చిన తనను రవీంద్ర, అతని అనుచరులు బలవంతంగా కారులో ఎత్తుకెళ్లి ఖాళీ పత్రాల్లో సంతకాలు చేయించుకొని దాడి చేశారని ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు ఆరుగురిపై కేసు నమోదు చేసి, కారును సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు.

# గ్లోబల్ ఎయిర్‌క్రాఫ్ట్ లీజింగ్ హబ్‌లకు తోడ్పాటుగా భారత్

**-కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడి వ్యాఖ్య**



గాంధీనగర్: గ్లోబల్ ఎయిర్‌క్రాఫ్ట్ లీజింగ్ హబ్‌లతో పోటీ పడాలని కాకుండా వాటికి తోడ్పాటును అందించేందుకు భారత్ చూస్తోందని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు వ్యాఖ్యానించారు. గుజరాత్ రాజధాని గాంధీనగర్‌లో ఉన్న గిఫ్ట్ సిటీలో జరిగిన ఎయిర్‌క్రాఫ్ట్ లీజింగ్ అండ్ ఫైనాన్సింగ్ సమిట్ 2.0 ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొన్నారు. "యావత్ ప్రపంచ దృష్టిని ఆకర్షించే వేగంతో దేశ విమానయాన రంగం రూపాంతరం చెందుతోంది. భారత్ నిర్మించే పర్యావరణ వ్యవస్థతో దేశానికే కాదు, దాని చుట్టుపక్కల ప్రాంతానికీ ప్రయోజనం చేకూరుతుంది. మేం ప్రపంచస్థాయిలో కీలక శక్తిగా ఎదగాలనుకుంటున్నాం. అదే సమయంలో గ్లోబల్ మార్కెట్‌కు తోడ్పాటును అందించాలనుకుంటున్నాం. భారత్‌కు అతిపెద్ద మార్కెట్ ఉంది. భవిష్యత్తులో ప్రపంచదేశాలు విమానయాన రంగంలో అగ్రగామిగా భారత్‌ను చూస్తాయి. సరైన పర్యావరణ వ్యవస్థను సృష్టించేందుకు తగు చర్యలు తీసుకోవడం అత్యంత ముఖ్యం. గిఫ్ట్ సిటీలోని ఐఎఫ్ఎస్‌సీని కేవలం రిజిస్ట్రేషను కేంద్రంగానే కాదు, పూర్తిస్థాయి సేవా కేంద్రంగా, గ్లోబల్ లీజింగ్ హబ్‌గా అభివృద్ధి చేయాలి. గిఫ్ట్ సిటీలో పలు విమాన లీజింగ్ సంస్థలు ఇప్పటికే కార్యకలాపాలు ప్రారంభించాయి. 2032 నాటికి దేశంలో విమానాల సంఖ్య భారీగా పెరుగుతుంది. ప్రపంచంలోనే మూడో అతిపెద్ద పౌర విమానయాన మార్కెట్‌గా త్వరలో భారత్ అవతరిస్తుంది. దేశీయ ఆర్థిక సంస్థలు కూడా ఈ రంగంలో భాగస్వామ్యం కావాలి. విమానయాన రంగానికి అవసరమైన చట్టపరమైన, ఆర్థిక సంస్కరణలను కేంద్రం కొనసాగిస్తుంది. విమానయాన రంగంలో పెరగనున్న డిమాండును తీర్చేందుకు భారత్ కూడా ఓ వ్యవస్థను నిర్మిస్తోంది" అని రామ్మోహన్ వ్యాఖ్యానించారు. అహ్మదాబాద్‌లో గత ఏడాది జరిగిన ఎయిరిండియా విమాన ప్రమాద ఘటనపై దర్యాప్తు చివరి దశకు చేరుకుందని, మరో నెలలో తుది నివేదిక విడుదలయ్యే అవకాశముందని ఆయన వెల్లడించారు. బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా పారదర్శకంగా విచారణ కొనసాగుతోందని తెలిపారు.

# రిటైర్డ్ ఐపీఎస్ అధికారి భార్య దారుణహత్య

**- జూబ్లీహిల్స్‌లో నగలు, నగదు కోసం నేపాలీ గ్యాంగ్ ఘాతుకం - ఇంట్లో పనిమనిషి సహకారంతో దోపిడీ**





హైదరాబాద్: బంగారు నగలు, నగదు కోసం నేపాలీ గ్యాంగ్ ఘాతుకానికి పాల్పడింది. హైదరాబాద్‌లో రిటైర్డ్ ఐపీఎస్ అధికారి భార్య నోట్లో గుడ్డలు కుక్కి దారుణంగా హత్య చేసింది. వివరాల్లోకి వెళితే...జూబ్లీహిల్స్ పరిధిలోని ప్రశాసన్‌నగర్ రోడ్ నం.7లో ప్లాట్ నం. 46లో జైళ్లశాఖలో అదనపు డీజీగా పనిచేసి రిటైర్ అయిన వినయ్ రంజన్‌రాయ్ కుటుంబం ఉంటోంది. ఈ నెల 1వ తేదీన వినయ్ రంజన్‌రాయ్ చికిత్స కోసం బెంగళూరుకు వెళ్లారు. ఇంట్లో ఆయన భార్య తనూజ రంజన్ (60) మొదటి అంతస్తులో ఉండగా, రెండో అంతస్తులో ఆమె ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మూడు నెలల క్రితం ఈ ఇంట్లో పనిమనిషిగా నేపాల్‌కు చెందిన కల్పన చేరింది. నమ్మకంగా పనిచేస్తున్నట్టు నటిస్తూ తనూజ ఆలనాపాలనా చూసేది.

తండ్రి బెంగళూరుకు వెళ్లడంతో మొదటి అంతస్తులో తల్లి ఒక్కరే ఉంటారని, బెడ్‌రూమ్ ముందు హాల్‌లో పడుకోవాహాలని పెద్దకూతురు సునంద గురువారం రాత్రి 9 గంటలకు కల్పనకు చెప్పి పైఅంతస్తుకు వెళ్లింది. అంతకుముందే పథకం వేసుకున్న కల్పన రాత్రి 1 గంట సమయంలో ఇంటి బయటకు వచ్చింది. అప్పటికే ఇంటి పక్కన మున్సిపల్ పార్కులో వేచి చూస్తున్న ముగ్గురు నేపాలీలను ఇంట్లోకి తీసుకెళ్లింది. ఆమె బయట కాపలా ఉండగా, ఆ ముగ్గురూ మొదటి అంతస్తులోకి వెళ్లి నిద్రిస్తున్న తనూజను లేపి కాళ్లు, చేతులు కట్టేసి నోట్లో గుడ్డలు కుక్కి ఆమె ఒంటిమీద ఉన్న నగలతోపాటు అల్మారాలో ఉన్న నగదు, రూ. కోట్ల విలువ చేసేబంగారు వజ్రాభరణాలను మూటగట్టుకొని 3.30 గంటల ప్రాంతంలో నలుగురు కలిసి ఉడాయించారు. ఉదయం 9.30 గంటలకు పెద్ద కూతురు సునంద బయట కార్పెంటర్ వెయిట్ చేస్తుండగా ఇంట్లోకి పిలిచి మొదటి అంతస్తులోకి తీసుకెళ్లింది. ఆమె వెళ్లేసరికి తల్లి బెడ్‌రూమ్‌లో నేల మీద కాళ్లు చేతులు కట్టేసి ఉండటంతోపాటు నోట్లో గుడ్డలు కుక్కి ఉండి అచేతనంగా పడి ఉండటాన్ని గమనించింది. వెంటనే తన సోదరి, డ్రైవర్ సహాయంతో అపోలో ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్టు డాక్టర్లు చెప్పారు. జూబ్లీహిల్స్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్, నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్, ఇంటెలిజెన్స్ విభాగ ఐజీ, సీసీఎస్ డీసీపీ తదితరులు అంతా ఘటనాస్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ సహాయంతో ఆధారాలు సేకరించారు. జరిగిన ఘటనపై సునంద జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఉస్మానియా ఆస్పత్రిలో తనూజ మృతదేహానికి పోస్ట్‌మార్టం నిర్వహించారు. ఆమె ఒంటిమీద ఎలాంటి గాయాలు లేకపోవడం చూస్తే ఆమెపై దాడి జరగలేదని కేవలం నోట్లో గుడ్డలు కుక్కడం వల్ల ఊపిరాడక చనిపోయి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. తమ బెడ్‌రూమ్‌లోని అలమారాలో భారీగా నగదు, నగలు ఉన్నాయని అవి ఎంత అనే విషయం తెలియదని మృతురాలి భర్త వినయ్ రంజన్‌రాయ్ పోలీసులకు ఫోన్‌లో చెప్పారు.

సీసీ ఫుటేజీలో నలుగురు...నేపాలీ గ్యాంగ్ ఇంట్లోకి వస్తున్న, బయటకు వెళుతున్న దృశ్యాలు సీసీ ఫుటేజీలో స్పష్టంగా కనిపించాయి. రాత్రి ఒంటిగంట ప్రాంతంలో పని మనిషి బయటికి వచ్చి వారిని పిలవగా చేతుల్లో కత్తులు, రాడ్లతో ముగ్గురు ఆగంతకులు లోపలికి రావడం కనిపించింది. సరిగ్గా 3.30 గంటల ప్రాంతంలో వీరంతా బంగారు, నగదు ఉన్న బ్యాగుతో ఉడాయించారు. అంతకుముందు రోజు రాత్రి కూడా ఇక్కడ ఈ గ్యాంగ్ రెక్కీ నిర్వహించినట్టుగా పోలీసుల దర్యాప్తులో తేలింది. గడిచిన నెల రోజుల నుంచి వీరు ఈ ఇంట్లో దొంగతనానికి పథకం వేసినట్లు తెలుస్తున్నది. కల్పన పనిలో చేరేముందు ఎలాంటి ఆధారాలు యజమానులకు ఇవ్వలేదు. వీరి కోసం ముమ్మర గాలింపు జరుగుతోంది. వీరు నేపాల్‌లోకి ప్రవేశించకముందే పట్టుకోవాలని వేర్వేరు చోట్ల బృందాలు నిఘా పెట్టాయి.

# డబుల్ ఇంజిన్ సర్కారుతో అభివృద్ధి జోరు

**-అనకాపల్లి - చర్లపల్లి ఏసీ రైలు ప్రారంభం**



అనకాపల్లి: అనకాపల్లి రైల్వే స్టేషన్ నుంచి వారం రోజుల వ్యవధిలోనే రెండు కొత్త రైళ్లు ప్రారంభించామని రైల్వే స్టాండింగ్ కమిటీ ఛైర్మన్, అనకాపల్లి ఎంపీ సి.ఎం.రమేశ్ పేర్కొన్నారు. అనకాపల్లి-చర్లపల్లి (17054) వారాంతపు ఏసీ ఎక్స్‌ప్రెస్ రైలును జేసీ శౌర్యమాన్ పటేల్, ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, బండారు సత్యనారాయణ, కె.ఎస్.ఎన్.ఎస్.రాజు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డబుల్ ఇంజిన్ సర్కార్‌తో రాష్ట్రం అభివృద్ధిలో దూసుకుపోతోందన్నారు. పరిశ్రమల రాకతో అనకాపల్లికి జాతీయ స్థాయిలో తొలి ప్రాధాన్యం దక్కుతుందన్నారు. గతంలో సాధారణ బోగీలతో నడిచే రైలును ప్రయాణికుల సౌకర్యార్థం పూర్తి స్థాయి ఏసీ కోచ్‌లతో అందుబాటులోకి తీసుకువచ్చామని చెప్పారు. రాబోయే రోజుల్లో దేశంలోని పలు ప్రాంతాలకు ఇక్కడి నుంచి రైళ్లు నడిచే అవకాశం ఉందన్నారు.

# రెండేళ్లలో 225 ఉచిత గుండె శస్త్రచికిత్సలు

**-గుంటూరు సర్వజనాసుపత్రి వైద్యుల ఘనత**



గుంటూరు: పేదల పాలిట సంజీవనిలా గుంటూరు సర్వజనాసుపత్రి (జీజీహెచ్) కార్డియోథొరాసిక్ విభాగం రెండేళ్లలో 225 మందికి ఉచితంగా గుండె శస్త్రచికిత్సలు చేసిందని ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎస్.ఎస్.వి.రమణ తెలిపారు. జీజీహెచ్‌లో కార్డియోథొరాసిక్ విభాగ వైద్య బృందంతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. గుండె సమస్యలున్న రోగులు ఓపెన్ హార్ట్ సర్జరీ చేయించుకోవాలంటే కార్పొరేట్ ఆసుపత్రుల్లో రూ.5 లక్షలకు పైగానే ఖర్చవుతుందన్నారు. దీంతో పేదలు జీజీహెచ్‌ను సంప్రదిస్తుండగా కార్డియోథొరాసిక్ విభాగం నిపుణులు హరికృష్ణ, కుప్పుస్వామి, యోగి, మత్తు వైద్యులు పోలయ్య, ప్రియదర్శిని, ప్రవీణ్ బృందం అవసరమైన వారికి ఉచితంగా గుండె ఆపరేషన్లు చేస్తున్నారన్నారు. 2025 మార్చి నుంచి 2026 మార్చి వరకు 125 గుండె శస్త్రచికిత్సలు, అంతకుముందు 100 శస్త్రచికిత్సలు విజయవంతంగా పూర్తి చేశారన్నారు. ఎన్టీఆర్ వైద్యసేవ పథకం కింద గుండె వాల్వ్ రిప్లేస్‌మెంట్, బైపాస్ సర్జరీలతోపాటు పుట్టుకతో వచ్చే గుండె లోపాలు సరిదిద్దుతున్నామని చెప్పారు. గత ఏడాదిలో 125 మందికి ఖర్చుతో కూడుకున్న గుండె పరీక్షలు కూడా ఉచితంగా చేశామన్నారు. జీజీహెచ్‌కు అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లు, వైద్యబృందం, శస్త్ర చికిత్సలకు అవసరమైన పరికరాలను ప్రభుత్వం అందించడం వల్లే ఈ ఘనత సాధించామని పేర్కొన్నారు. వైద్యులు హరికృష్ణ, కుప్పుస్వామి, యోగి మాట్లాడుతూ నిత్యం వ్యాయామం చేయడంతోపాటు ఒత్తిడిని తగ్గించుకుంటూ ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం ద్వారా గుండె జబ్బుల ప్రమాదం నుంచి తప్పించుకోవచ్చన్నారు. ఇటీవల శస్త్ర చికిత్సలు చేయించుకున్న పలువురు రోగులు ఆసుపత్రిలోని వైద్యసేవలపై వివరించి వైద్యులు, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఏవో ప్రవీణ్, నర్సింగ్ స్టాఫ్, సిబ్బంది పాల్గొన్నారు.

# ఈఏపీ సెట్ హాల్‌టికెట్లపై పరీక్ష కేంద్రం క్యూఆర్ కోడ్

**-12 నుంచి పరీక్షలు రాయనున్న 3,55,008 మంది**



కాకినాడ: జేఎన్‌టీయూ (కాకినాడ) ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఏపీ ఈఏపీసెట్-2026కు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు సెట్ ఛైర్మన్, జేఎన్‌టీయూకే ఉపకులపతి సీఎస్ఆర్‌కే ప్రసాద్, సెట్ కన్వీనర్ ఎన్.మోహనరావు తెలిపారు. కాకినాడలో వారు మాట్లాడుతూ ఈ నెల 12 నుంచి 15వ తేదీ వరకు, తిరిగి 18న ఇంజినీరింగ్, 19, 20 తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మసీ విభాగాలకు పరీక్షలు ఉంటాయన్నారు. ఉదయం 9-12 గంటల వరకు, మధ్యాహ్నం 2-5 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. ఈ ఏడాది మొత్తం 3,55,008 మంది దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు.

142 కేంద్రాలు....ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతించరని.. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ముందురోజే పరీక్ష కేంద్రాన్ని సందర్శించి, చిరునామా తెలుసుకోవాలని సూచించారు. మొత్తం 142 కేంద్రాల్లో పరీక్షలు జరుగుతాయని, హైదరాబాద్‌లో ఒక సెంటర్ ఏర్పాటుచేశామని, ఉర్దూ మీడియానికి కర్నూలులో రీజనల్ సెంటర్‌ను కేటాయించామని వివరించారు. హాల్‌టికెట్‌చివరలో క్యూఆర్ కోడ్ ఉంటుందని, దాన్ని స్కాన్ చేస్తే పరీక్ష కేంద్రం లొకేషన్ గూగుల్ మ్యాప్స్‌లో వస్తుందని చెప్పారు.

